సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
సోమవారం । 27 । మే । 2024



నిత్యాన్నదాన ట్రస్టుకు..

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని నిత్యాన్నదాన ట్రస్టుకు తాడూరి రంగారావు, వెంకట రమణి దంపతులు (కాకినాడ) ఆదివారం రూ.25 వేల విరాళం సమర్పించారు.



రూ.50 వేల విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి నాగవరపు హరిబాబు (ఒంగోలు) ఆదివారం రూ.50 వేల విరాళం సమర్పించారు.

గరిష్ఠం/కనిష్ఠం
40.0° / 27.6°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	40.0	29.0
కాకినాడ	37.0	27.6
అమలాపురం	39.0	28.0

న్యూస్‌రీల్

హద్దు దాటితే కఠిన చర్యలు



అమలాపురంలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ మహేశ్వరరావు, పట్టణ సీఐ క్రిస్టోఫర్

అమలాపురం టౌన్: ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా జిల్లా పోలీసు శాఖ ముందస్తు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లలో నమోదైన రౌడీషీటర్లకు ఆదివారం ఆయా పోలీసు అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. జిల్లా ఎస్పీ సునరావు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆదేశాలతో ఈ కార్యక్రమాలు జరిగాయి. రామచంద్రపురం పోలీసు సర్కిల్ పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్లల్లో రౌడీ షీటర్లకు డీఎస్పీ బి.రామకృష్ణ, సీఐ పి.దొరరాజు కౌన్సిలింగ్ నిర్వహించారు. మండపేట పోలీస్ స్టేషన్ పక్కన గల బాలికల ఉన్నత పాఠశాల క్రీడా స్థలంలో డీఎస్పీ రామకృష్ణ, రూరల్ సీఐ కె.శ్రీధర్ కుమార్ కౌన్సెలింగ్ ఇచ్చారు. అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు డీఎస్పీ ఎం.మహేశ్వరరావు, పట్టణ సీఐ కె.క్రిష్టోఫర్, పట్టణ ఎస్సైలు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఐ.పోలవరం పోలీసు స్టేషన్ పరిధిలోని ఎదుర్లంక చెక్ పోస్ట్ వద్ద వాహనాలు ఆపి తనిఖీలు నిర్వహించారు. ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి అతడి నుంచి ఐదు నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. ఆత్రేయపురం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.11,970, 8 సెల్ ఫోన్లు సీజ్ చేశారు. రామచంద్రపురం పట్టణం రెల్లిపేటలో పట్టణ ఎస్సై కె.సురేష్ బాబు క్యాసో తనిఖీలు నిర్వహించి రికార్డులు లేని 16 మోటారు సైకిళ్లను సీజ్ చేశారు.

ఘనంగా బౌద్ధ సాంస్కృతిక ఉత్సవాలు



ఆదుర్రులో జరిగిన జయంత్యుత్సవంలో పాల్గొన్న బౌద్ధులు

మామిడికుదురు: ఆదుర్రులోని ప్రాచీన ఆదుర్రు ఆది బౌద్ధ స్థూపం వద్ద 2569వ బుద్ధ జయంత్యుత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రాచీన భారతీయ వారసత్వ బౌద్ధ సాంస్కృతిక ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మీరట్‌కు చెందిన పూజ్య భిక్షు డాక్టర్ నాగభూషణం కొండయ్య సారథ్యంలో పూజ్య భంతేజీ బౌద్ధ ధమ్మం స్వీకరించిన వారికి ధమ్మదానం చేశారు. ప్రపంచ శాంతిని కాంక్షించిన మహోన్నతుడు గౌతమ బుద్ధుడు బోధించిన చతురార్య సత్యాలు, అరియ అష్టాంగ మార్గం పాటించాలని సూచించారు. నేపాల్‌లోని లుంబినీ వనంలో జన్మించిన బుద్ధుడు తన 35వ ఏట బీహార్‌లోని బుద్ధగయలో జ్ఞానోదయం పొంది బుద్ధునిగా అవతరించారని చెప్పారు. ఆయన సూచించిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ ముందుకు వెళ్లాలన్నారు. ఆదుర్రు బుద్ధ విహార్ ట్రస్టు కార్యదర్శి ఎస్ఎస్ఆర్ భూపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవంలో కమిటీ ప్రతినిధులు కాశి వెంకట రమణ, పెనుమాల సుధీర్, చింతా శ్రీరామమూర్తి, మెండి ప్రతాప్ కుమార్, బళ్ల శ్రీనివాసరావు, భయ్యా మోహనరావు, పులపర్తి కృష్ణమూర్తి, తోట రామారావు, కొనుకు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాల బాలాజీకి రూ.1.68 లక్షల ఆదాయం



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఉద్యోగులు

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామికి ఆదివారం వివిధ సేవల ద్వారా రూ.1.68 లక్షల ఆదాయం లభించిందని ఆలయ ఈఓ గ్రంధి మాధవి తెలిపారు. దీనిలో లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,14,500, నిత్యాన్నదానం ట్రస్టుకు భక్తులు ఇచ్చిన విరాళం రూ.54,294 ఉన్నాయన్నారు. కాగా ఆదివారం స్వామిని 2,385 మంది దర్శించుకున్నారు. 1,569 మంది అన్న ప్రసాదం స్వీకరించారు. అమలాపురం మొబర్లీపేటకు చెందిన దాతలు స్వామివారి నిత్యాన్నదానం ట్రస్టుకు రూ.25 వేలు విరాళం ఇచ్చారు. అమలాపురం భ్రమరాంబా సమేత చెన్నమల్లేశ్వరస్వామి వారి తరపున ఈ విరాళం అందించారు. ఆలయ సిబ్బంది వారికి స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

మెరుగ్గా.. నూతనంగా..



తిరుపతిలో శిక్షణ పొందుతున్న సీసీహెచ్‌లు (ఫైల్)

- మరింత రుచిగా గోరుముద్ద
- మిడ్డే మీల్స్ కుక్‌లు, హెల్పర్లకు తాజ్ హోటల్ చెఫ్‌లతో శిక్షణ
- జిల్లా నుంచి నలుగురు ఎంపిక
- మిగిలిన వారికి మండల కేంద్రాల్లో నేటి నుంచి శిక్షణ



పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

రాయవరం: ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్ల మాదిరిగా అభివృద్ధి చేసిన రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు కావాల్సిన అన్ని వసతులు కల్పించింది. పుస్తకాలు, బ్యాగులు, షూ, యూనిఫాం సమయానికి అందించి విద్యాభివృద్ధికి కృషి చేస్తోంది. వారికి మధ్యాహ్న భోజనం పథకం (మిడ్డే మీల్స్)లో రుచికరమైన భోజనం అందజేస్తోంది. ఇప్పుడు దానిని మరింత నాణ్యతగా, రుచిగా అందించేందుకు చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా పాఠశాలల్లో వంటలు చేసే కుక్‌లు, హెల్పర్లకు తిరుపతి తాజ్ హోటల్ చెఫ్‌లతో శిక్షణ ఇచ్చింది. ఆ కార్యక్రమానికి జిల్లా నుంచి నలుగురు మహిళలు హాజరై విజయవంతంగా శిక్షణ పొందారు. జిల్లాలోని మిగిలిన కుక్‌లు, హెల్పర్లకు సోమవారం నుంచి ఆ నలుగురూ శిక్షణ ఇస్తారు.

ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యతో పాటుగా పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. ఇందులో భాగంగా గోరుముద్ద పథకం కింద రోజుకొక మెనూతో ఆహారాన్ని అందించడమే కాకుండా, విద్యార్థుల్లో రక్తహీనతను తగ్గించేందుకు వారానికి ఐదు రోజులు కోడిగుడ్లు, సోమ, బుధ, శుక్రవారాల్లో చిక్కి, మంగళ, గురు, శనివారాల్లో రాగిజావను కూడా అందజేస్తోంది. మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించే క్రమంలో భాగంగా మధ్యాహ్న భోజనాన్ని తయారు చేసే ఏజెన్సీలకు గతేడాది అక్టోబర్‌లో కొత్త వంట పాత్రలు అందజేసింది.

ప్రణాళికాబద్ధంగా చర్యలు

త్వరలో పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యాశాఖ రాష్ట్ర అధికారులు విద్యార్థులకు మరింత రుచికరంగా మధ్యాహ్న భోజనాన్ని అందించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా తిరుపతి తాజ్ హోటల్ చెఫ్‌లతో మిడ్ డే మీల్స్ ఆయాలకు శిక్షణ నిచ్చారు. స్టార్ హోటళ్లలో వండే వంటకాలు మాదిరిగా బడిలో కూడా మధ్యాహ్న భోజనం తయారు చేసేలా మిడ్డే మీల్స్ కుక్ కమ్ హెల్పర్లకు శిక్షణనిచ్చారు. జిల్లా స్థాయిలో గుర్తించిన నలుగురు మిడ్డే మీల్స్ ఏజెన్సీ మహిళలకు ఈ శిక్షణ పొందారు. వీరందరూ సోమవారం నుంచి జూన్ ఒకటో తేదీ వరకూ తమకు కేటాయించిన మండలాల్లో మధ్యాహ్న భోజన పథకం ఆయాలకు శిక్షణ ఇవ్వనున్నారు.

వంటకాలపై శిక్షణ

తిరుపతి తాజ్ హోటల్ చెఫ్‌ల శిక్షణకు జిల్లాలో రామచంద్రపురం డివిజన్ నుంచి ఎస్.సీతారామలక్ష్మి, వి.నాగమణి, అమలాపురం డివిజన్ నుంచి డి.వరలక్ష్మి, టి.తులసి శిక్షణ హాజరయ్యారు. వీరందరూ పులిహోర, వెజ్ బిర్యానీ, ఆకుకూర పప్పు, పప్పుచారు, స్వీట్ పొంగల్ తదితర పాఠశాలలో వండే వంటకాలపై రోజు వారీ మెనూ ప్రకారం వండే వంటకాల తయారీపై శిక్షణ పొందారు.

నేటి నుంచి శిక్షణ

జిల్లాలోని వివిధ మండలాల్లో మధ్యాహ్న భోజనం కుక్ కమ్ హెల్పర్లకు సోమవారం నుంచి మధ్యాహ్న భోజనం తయారీపై శిక్షణ ఇవ్వనున్నారు. ప్రతి మండల కేంద్రంలో జరిగే ఈ కార్యక్రమానికి ఆయా మండలాల పరిధిలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న సీసీహెచ్‌లు హాజరవుతారు. ఉదయం పూట శిక్షణ అనంతరం మధ్యాహ్నం మండలాల్లో సీసీహెచ్‌లకు పోటీలు నిర్వహిస్తారు. ఈ పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారిని ఎంపిక చేసి, ఆ జాబితాను రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపిస్తారు. వారికి బహుమతులు కూడా అందజేస్తారు.

శిక్షణ జరిగే విధానం

తేదీ	మండలాలు
మే 27	అల్లవరం, మామిడికుదురు, రామచంద్రపురం, కె.గంగవరం.
మే 28	అమలాపురం, ముమ్మిడివరం, కపిలేశ్వరపురం,రాయవరం.
మే 29	ఐ.పోలవరం, రాజోలు, మండపేట, ఆత్రేయపురం.
మే 30	కొత్తపేట, అయినవిల్లి, సఖినేటిపల్లి, కాట్రేనికోన.
మే 31	మలికిపురం, ఉప్పలగుప్తం, అల్లమూరు, పి.గన్నవరం.
జూన్ 1	అంబాజీపేట, రావులపాలెం.

జిల్లాలోని 1,528 పాఠశాలల్లో గోరుముద్ద పథకంలో భాగంగా మిడ్డే మీల్స్‌ను అమలు చేస్తున్నారు. గత విద్యా సంవత్సరంలో సరాసరి రోజుకు 1.80 లక్షల మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తీసుకున్నారు.

పూర్తయిన ఏర్పాట్లు



రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు శిక్షణను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. దీనిపై మండల విద్యాశాఖాధికారులకు గూగుల్ మీట్ నిర్వహించాం. సీసీహెచ్‌లు పొందే శిక్షణ వారి వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి ఉపకరిస్తుంది.

– నక్కా సురేష్, ఏడీ, డీఈవో కార్యాలయం, అమలాపురం

సద్వినియోగం చేసుకోవాలి



ఈ శిక్షణను మధ్యాహ్న భోజనం తయారు చేసే కుక్, హెల్పర్లను సద్వినియోగం చేసుకోవాలి. విద్యార్థులకు మరింత రుచికరంగా మధ్యాహ్న భోజనం అందించడమే ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశం. దీనికి సంబంధించిన ఉత్తర్వులు కింది స్థాయికి జారీ చేశాం. ప్రతి సీసీహెచ్ శిక్షణలో పాల్గొనేలా మండల విద్యాశాఖాధికారులు బాధ్యత తీసుకోవాలి.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష

అమలాపురం రూరల్: ఐఐటీలో ప్రవేశానికి సంబంధించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) 2024 అడ్వాన్స్‌డ్ పరీక్ష భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ క్యాంపస్‌లో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. మొత్తం 184 మందికిగాను 182 మంది హాజరయ్యారు. జిల్లాలో పరీక్ష కేంద్రంగా బీవీసీ సెంటర్‌లో ఒక్కటే కేటాయించారని ఆన్‌లైన్ సెంటర్ కోఆర్డినేటర్ అడబాల కుమార్ తెలిపారు. పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని కళాశాల ప్రిన్సిపాల్ జేవీసీ రామారావు, ఏఓ జక్కం కృష్ణారావు తెలిపారు.

అయినవిల్లికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో వివిధ పూజలు నిర్వహించారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి లఘున్యాస అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమంలో 89 మంది భక్త దంపతులు పాల్గొన్నారు. పంచామృతాభిషేకాల్లో ఐదుగురు, లక్ష్మీగణపతి హోమంలో 46 మంది పాల్గొని పూజలు నిర్వహించారు. 29 వాహన పూజలు, 16 మంది చిన్నారులకు నామకరణాలు, అక్షరాభ్యాసాలు జరిగాయి. స్వామివారి అన్నదాన పథకంలో 2,350 మంది అన్నప్రసాదం స్వీకరించారు. స్వామి వారికి వివిధ పూజలు, అన్నదానం విరాళాలుగా రూ.3,05,886 లభించిందని ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు, ఆలయ కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

వీరభద్రస్వామి ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

అమలాపురం రూరల్: మండలంలోని ఇమ్మిడివరప్పాడు నిర్మిస్తున్న వీరభద్రస్వామి ఆలయం నిర్మాణానికి దివంగత సోరపల్లి మల్లికార్జునరావు, సూర్యకాంతం పేరుపై వారి కుమారుడు రామ్మోహనరావు, కోడలు సుబ్బలక్ష్మి ఆదివారం రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఈ మేరకు స్వామివారి ఆలయ కమిటీకి బ్యాంకు చెక్కు అందించారు.

రెమాల్ అలజడి



బీచ్ రోడ్డుపై ప్రవహిస్తున్న సాగర జలాలు



బీచ్ రోడ్డులో వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్న పోలీసులు



ఉప్పాడ - కాకినాడ బీచ్ రోడ్డుపై విరుచుకుపడుతున్న భీకర కెరటాలు

కొత్తపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన రెమాల్ తుపాను ముప్పు మన రాష్ట్రంపై లేనప్పటికీ, దీని ప్రభావంతో ఉప్పాడ తీరంలో సముద్రం ఆదివారం అల్లకల్లోలంగా మారింది. అలలు పెద్ద ఎత్తున ఎగసి పడటంతో ఉప్పాడ, కోనపాపపేటలో తీర ప్రాంతాల్లోని ఇళ్లు, ఉప్పాడ – కాకినాడ బీచ్ రోడ్డు కోతకు గురవుతున్నాయి. భీకర కెరటాలు విరుచుకుపడుతూండటంతో తీర ప్రాంత ప్రజలు, మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఓవైపు అలలు ఎగసి పడుతున్నప్పటికీ బీచ్ రోడ్డులో పలువురు ప్రయాణాలు సాగించారు. ప్రమాదాన్ని గుర్తించిన పోలీసులు బీచ్ రోడ్డులో రాకపోకలు నిలిపివేశారు. అయినప్పటికీ పలువురు తీరానికి చేరుకుని సాగర కెరటాల కల్లోలాన్ని వీక్షించేందుకు ఉత్సాహం చూపారు.

వేసవి శిక్షణ.. విజ్ఞాన వీచిక

- ఉత్సాహంగా శిక్షణ తరగతులు
- తరలివస్తున్న విద్యార్థులు

అమలాపురం టౌన్: వేసవి సెలవులు అంటే పిల్లలకు చాలా సరదా. ఏడాది పాటు చదువులతో కుస్తీలు పట్టిన వారందరూ సెలవులలో ఆటపాటలతో గడుపుతారు. అయితే కేవలం ఆటలతోనే కాకుండా వారికి విజ్ఞానాన్ని కూడా అందించేలా చర్యలు తీసుకోవాలి. దానికి వేసవి శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగపడుతున్నాయి. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ఈ తరగతులకు పంపించి, వారికి కొత్త వాతావరణాన్ని అలవాటు చేస్తున్నారు. మానవతా విలువలు, క్రీడలు, యోగా, పలు వస్తువుల తయారీ వంటి రంగాల్లో శిక్షణ పొందే అవకాశం కల్పిస్తున్నారు. కాస్త ఖాళీ దొరికితే చాలు స్మార్ట్ ఫోన్లకు అతుక్కుపోయిన్న పిల్లలు కూడా వేసవి తరగతులపై ఆసక్తి చూపుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా..

జిల్లా వ్యాప్తంగా మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో పిల్లలకు ఉచిత వేసవి శిక్షణ ఇచ్చే సంస్థలు అనేకం ముందుకు వచ్చాయి. ఐదేళ్ల నుంచి 16 ఏళ్ల వయసున్న పిల్లలు ఈ ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుంటున్నారు. జిల్లా కేంద్రమైన అమలాపురంలో క్రీడలు, యోగా, పుస్తక పఠనం, కుటుంబ విలువలు, నీతి కథలు వంటి వాటిని నేర్పుతున్నారు.



అమలాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బాస్కెట్ బాల్ శిక్షణ పొందుతున్న విద్యార్థులు



సత్యసాయి బాల వికాస్ తరగతులలో పాల్గొన్న విద్యార్థులు

చదవడం మాకిష్టం

కార్పొరేట్ చదువులు వచ్చాక పిల్లల్లో పుస్తక పఠనం క్రమేపీ తగ్గిపోతోంది. ఈ క్రమంలో స్థానిక ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో ఈ నెల 15 నుంచి జూన్ 7వ తేదీ వరకూ జరుగుతున్న వేసవి ఉచిత శిక్షణా తరగతులలో వివిధ రంగాల నిపుణులు పుస్తక పఠనంపై పిల్లలకు ఆసక్తి పెంచుతున్నారు. చదవడం మాకిష్టం పేరుతో వారిలో పఠనాశక్తిని ఇనుమడింపచేస్తున్నారు. నీతి కథలు చదవడం అలవర్చుతున్నారు. యోగా గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ పిల్లలకు యోగాసానాలపై శిక్షణ ఇస్తున్నారు. గ్రంథాలయాధికారి జీవీఆర్ఎస్‌హెచ్‌కే వర్మ, గ్రంథాలయ నిర్వాహకుడు పోలిశెట్టి సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో ఇవి జరుగుతున్నాయి.


క్రీడా స్ఫూర్తిని పెంచేందుకు..



నేను అమలాపురంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బాస్కెట్‌బాల్ శిక్షణ పొంది జాతీయ స్థాయికి ఎదిగాను. అప్పట్లో స్వయం శిక్షణ, స్వయం శక్తితో క్రీడల్లో రాణించాం. అయితే నేటి వేగవంతమైన విద్యా విధానంతో బిజీ అయిపోయిన విద్యార్థులకు వేసవి సెలవుల్లో క్రీడా శిక్షణ ఇస్తే వారిలోని ప్రతిభ వెలుగు చూస్తుంది. వారిలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని బయటకు తీసేందుకు బాస్కెట్ శిక్షణ ఇస్తున్నాం.

– కుడుపూడి సూర్యనారాయణరావు, ఎమ్మెల్సీ, అమలాపురం

విలువలు నేర్పాలి



విద్యార్థులు పుస్తకాలు చదువుతూ ఎంత విజ్ఞానాన్ని సముపార్జించినా వారికి నైతికతను పెంపొందించే కుటుంబ విలువలు తెలియాలి. దీనికోసమే సత్యసాయి సేవా సంస్థలు, బాల వికాస్ ద్వారా వేసవిలో పది రోజుల పాటు శిక్షణ ఇచ్చాం. దాదాపు 100 మంది విద్యార్థులకు అవగాహన కల్పించాం. వారికి మానవ సంబంధాల గొప్పదనాన్ని వివరించాం.

– శిష్టా గుణరంజన్, జిల్లా సత్యసాయి బాల వికాస్ కేంద్రాల గురువు, అమలాపురం

బాస్కెట్ బాల్ శిక్షణ

అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో దివంగత ఐపీఎస్ అధికారి కుడుపూడి గోపాలకృష్ణ గోఖలే, మాజీ మంత్రి కుడుపూడి ప్రభాకరరావు జ్ఞాపకార్థం జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ నెల రోజుల పాటు విద్యార్థులకు బాస్కెట్ బాల్ శిక్షణ నిర్వహిస్తోంది. దాదాపు 200 మంది పిల్లలు ఈ శిక్షణ పొందుతున్నారు. బాస్కెట్ బాల్ మాజీ జాతీయ క్రీడాకారుడు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఆధ్వర్యంలో ఉత్సాహంగా జరుగుతోంది. శిక్షణ పొందిన విద్యార్థులకు ట్రాక్ షూలు, స్పోర్ట్స్ డ్రెస్సులను కలెక్టర్ హిమాన్షు శుక్లా అందించనున్నారు. జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి సంసాని గంగాధర్ పర్యవేక్షణలో కోచ్‌లు ఆకుల ఉమా మహేశ్వరరావు, యనమదల బుజ్జి, కుడుపూడి బుజ్జి బాస్కెట్ బాల్ లో శిక్షణ ఇస్తున్నారు.

నైతిక విలువలే లక్ష్యంగా..

స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో డివిజన్ సత్యసాయి సేవా సంస్థలు, బాల వికాస్ సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులకు పది రోజుల పాటు వేసవి తరగతులు నిర్వహించాయి. డివిజన్ సేవా సంస్థల కో ఆర్డినేటర్ డాక్టర్ జి.ప్రభాకర్ పర్యవేక్షణలో జరిగిన ఈ తరగతులను జిల్లా సత్యసాయి బాల వికాస్ కేంద్రాల గురువు శిష్టా గుణరంజన్ నిర్వహించారు. పిల్లల్లో నైతిక విలువలను పెంపొందించే దిశగా ఈ శిక్షణ సాగింది. ముఖ్యంగా కుటుంబ బంధాల విలువ, నీతి కథలు, మహా భారతం, రామాయణం, భాగవతం వంటి ఇతిహాస గ్రంథాలపై అవగాహన కల్పించారు.

క్లుప్తంగా

లారీ ఢీకొని యువకుడి మృతి


ఘటనా స్థలంలో సురేష్ మృతదేహం

రాజానగరం: లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. రాజమహేంద్రవరం – కేశవరం రోడ్డులోని జి.యర్రంపాలెం వద్ద ఆదివారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. రాజమహేంద్రవరంలోని శాటిలైట్ సిటీకి చెందిన అంగారపు సురేష్ (37) చెక్క మంచాలు చేసి, గ్రామాలలో విక్రయిస్తూ జీవనం సాగిస్తుంటాడు. అతడికి రెండు నెలల క్రితమే వివాహమైంది. ఈ క్రమంలో జి.యర్రంపాలెంలో మంచాలకు సంబంధించిన సొమ్ములు వసూలు చేసుకునేందుకుగాను మోటారు సైకిల్‌పై బయలుదేరాడు. జి.యర్రంపాలెం వెళ్తున్న అతడిని మట్టి లోడుతో వస్తున్న లారీ వేగంగా ఢీకొంది. ఆ మలుపులో ఎగువ నుంచి వెళ్లాల్సిన లారీ దిగువకు రావడంతో ఈ ప్రమాదం జరిగింది. సురేష్‌పై నుంచి లారీ చక్రాలు వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాజానగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాటాకిల్లు దగ్ధం


సీతానగరంలో కాలిపోయిన తాటాకిల్లు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలో ఆసనాల లక్ష్మికి చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. ఆదివారం ఉదయం 9 గంటలకు గ్యాస్ స్టవ్ వెలిగించగా, రెగ్యులేటర్ వద్ద గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న కర్టెన్‌కు అంటుకుని ఒక్కసారిగా ఎగసిపడ్డాయి. రాజమహేంద్రవరం నుంచి అగ్నిమాపక శకటం వచ్చి మంటలను అదుపు చేసింది. ఈ ప్రమాదంలో ఇంట్లోని దుస్తులు, రెండు ఫ్యాన్లు, ఫ్రిజ్, టీవీ, వంటసామగ్రి కాలిపోయాయి. సుమారు రూ.1.50 లక్షల ఆస్తి నష్టం సంభవించింది.

సాగులో యంత్రసాయం

- వ్యవసాయంలో పెరిగిన యంత్రాలు
- అన్ని పనులలో రైతులకు చేదోడు
- ఎండుగడ్డి కట్టలకూ అవే వినియోగం


ఎండుగడ్డిని కట్టలుగా కదుతున్న యంత్రం


పొలాల్లో ఎండుగడ్డి కట్టలు

రాయవరం: ఇటీవల వరి సాగులో యంత్రాల ప్రాధాన్యం పెరిగింది. దాదాపు 95 శాతానికి పైగా పంటను యంత్రాలతోనే కోయిస్తున్నారు. భూమిని దమ్ము చేయడం దగ్గరి నుంచి నాట్లు వేయడం, పురుగు మందుల పిచికారీ, పంట మాసూళ్ల వరకు యంత్రాలనే ఉపయోగిస్తున్నారు. ఇప్పుడు వరి చేనును కోత యంత్రాలతో కోసి, పొలాల్లో వదిలేసిన గడ్డిని కట్టలు కట్టడానికి సైతం యంత్రాలనే వినియోగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెద్ద మొత్తంలో సబ్సిడీపై యంత్రాలకు రుణాలు అందజేయడంతో గ్రామాల్లోని రైతులు కమిటీలుగా ఏర్పడి వివిధ రకాలు యంత్రాలను కొనుగోలు చేస్తున్నారు.

సులువైన పని

వ్యవసాయంలో యంత్రాలను ఉపయోగించడం వల్ల సాగు పనులు రైతులకు చాలా సులువుగా మారాయి. ముఖ్యంగా వరి కోతల సమయంలో కూలీల కొరతతో గతంలో ఇబ్బందులు పడేవారు. కోత యంత్రాలు రావడంతో పని సులువైంది. ఖర్చు తగ్గింది. అయితే మెషీన్‌తో కోయగా వచ్చిన గడ్డి పశువులకు దాణాగా ఉపయోగపడదని రైతులు భావించేవారు. దాన్ని అలాగే చేలల్లో వదిలేసేవారు. కానీ అది కేవలం అపోహ అని, ఆ గడ్డిలోనూ పోషకాలు ఉంటాయని, పైగా చిన్న ముక్కలుగా తెగిన గడ్డి పశువులకు త్వరగా జీర్ణమవుతుందని పశుసంవర్ధకశాఖ అధికారులు అవగాహన కల్పించారు. దీంతో రైతులు ప్రత్యేక యంత్రాల సాయంలో ఆ గడ్డిని కట్టలు కట్టించి, పశువులకు దాణాగా ఉపయోగిస్తున్నారు. యంత్రాలు అన్ని పనుల్లో రైతులకు చేదోడుగా మారాయి.

యంత్రాల వినియోగం

కోనసీమ జిల్లాలో ప్రధానంగా దాళ్వా సీజన్‌లో పంట మాసులుకు యంత్రాలను ఉపయోగించడం పరిపాటిగా మారింది. యంత్రంతో పంట మాసూళ్ల చేయడం వల్ల వరి గడ్డి ముక్కలు ముక్కలుగా తెగిపోతుంది. ఈ ముక్కలుగా తెగిన గడ్డిని పశువులకు మేతగా వేస్తే పెద్దగా ప్రయోజనం ఉండదని భావించి చేలల్లోనే తగలబెట్టేవారు. దీంతో పశువులకు ఎండుగడ్డి ఏర్పడేది. కొన్ని సమయాల్లో ఇతర జిల్లాల నుంచి గడ్డిని కొనుగోలు చేసేవారు. ఎకరం గడ్డి సుమారు రూ.6 వేలు నుంచి రూ.8 వేలు పలికేది. దీంతో పశువుల పెంపకం చాలా కష్టంగా మారింది.

వృథా కాదు.. పోషకాహారం

వరి కోత యంత్రాలతో మాసూలు చేసిన గడ్డి కూడా పశువులకు ఉపయోగపడుతుందని రైతులకు పశుసంవర్ధకశాఖ అధికారులు అవగాహన కల్పించారు. ముక్కలైన గడ్డిని తినడం వల్ల పశువులకు త్వరగా జీర్ణం అవుతుందని తెలిపారు. దీంతో రైతులు యంత్రాల ద్వారా మాసూలు చేయగా వచ్చిన గడ్డిని పశువులకు మేతగా ఉపయోగించడాన్ని అలవాటు చేసుకున్నారు.

జిల్లాలో 2.29 లక్షల పశువులు

జిల్లాలో దాదాపు 2.29 లక్షల పశువులు ఉన్నాయి. వీటిలో 75,460 ఆవులు, 1,53,542 గేదెలు ఉన్నాయి. వరికోత యంత్రాల ద్వారా మాసూలు చేసిన గడ్డిని పశువులు కూడా బాగా తింటున్నాయి. దీంతో ఆ గడ్డిని కట్టలు కట్టడానికి యంత్రాలను ఉపయోగిస్తున్నారు. గుంటూరు ప్రాంతం ఉంచి గడ్డిని కట్టలు కట్టే యంత్రాలు మన ప్రాంతానికి వస్తున్నాయి. వీటి ద్వారా కట్టలు కట్టించి ట్రాక్టర్లతో గట్టుకు చేర్చి గడ్డివాములుగా వేస్తున్నారు. ఇలా చేయడానికి ఒక్కో కట్టకు రూ.35 వసూలు చేస్తున్నారు. దీనికి రవాణా, కూలి ఖర్చులు అదనంగా ఉంటాయి. ఎకరం గడ్డిని కట్టలుగా కట్టించడానికి సుమారు రూ.2 వేల వరకూ ఖర్చవుతుంది.

ఆ గడ్డినే వినియోగిస్తున్నాం



గతంలో వరి కోత యంత్రాలతో మాసూలు చేసిన గడ్డిని వృథాగా వదిలేసేవాళ్లం. అది పశువులకు దాణాగా ఉపయోగపడదని భావించేవాళ్లం. పశుసంవర్ధకశాఖ అధికారుల సలహాతో ఆ గడ్డినే పశువులకు వేస్తున్నాం. యంత్రంతో కట్టలు కట్టించి, గడ్డివామిగా వేసి, అనంతరం పశువులకు ఉపయోగిస్తున్నాం.

– చేవా సత్యనారాయణ, రైతు, లొల్ల, రాయవరం మండలం

అవగాహన పెరిగింది



గడ్డిని కట్టలుగా చుట్టే యంత్రాలు రాని సమయంలో ఎండు గడ్డి వృథా అయ్యేది. గడ్డిని బెయిలింగ్ చేసే యంత్రాలు రావడం చాలా ఉపయోగంగా ఉంది. పశువులకు గడ్డి కొరత తీరింది. చాలామంది రైతులు అవగాహన పెంచుకున్నారు. పశువులకు మేత కొరత లేకుండా చూసుకుంటున్నారు.

– డాక్టర్ కర్నీడి మూర్తి, డిప్యూటీ డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ, అమలాపురం

ఘనంగా సత్యదేవుని రథోత్సవ సేవ


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

అన్నవరం: రత్నగిరిపై కొలువైన సత్యనారాయణ స్వామి, అనంతలక్ష్మి, సత్యవతీదేవి అమ్మవార్ల రథోత్సవ సేవను ఆదివారం ఉదయం ఆలయ ప్రాకారంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం పది గంటలకు రథాన్ని తూర్పురాజ గోపురం ముందుకు తీసుకువచ్చారు. దానిపై స్వామి, అమ్మవార్లను ఆశీనులు చేసి పూజలు జరిపారు. అనంతరం భక్తులు కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ పెద్దసంఖ్యలో తరలి వచ్చిన భక్తులతో కలిసి ఆలయ ప్రాకారంలో మూడుసార్లు రథంతో ప్రదక్షిణ నిర్వహించారు. రథోత్సవం అనంతరం పూజలు నిర్వహించి, స్వామి, అమ్మవార్లను మేళతాళాల మధ్య ఆలయానికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో వేద పండితులు గొల్లపల్లి ఘనాపాఠీ, ముష్టి పురుషోత్తం, చిట్టి శివ ఘనాపాఠీ, యనమండ్ర శర్మ, అర్చకులు చిట్టెం గోపి, పరిచారకులు ముత్య వెంకట్రావు, యడవిల్లి ప్రసాద్, ఆలయ ఏఈఓ డీవీఎస్ కృష్ణారావు పాల్గొన్నారు.

28న రగ్బీ పోటీలకు ఎంపిక

పిఠాపురం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పిఠాపురంలోని మినీ స్టేడియం గ్రౌండ్‌లో మంగళవారం ఉమ్మడి జిల్లా అండర్ –18 బాలురు, బాలికల ఎంపిక జరగనుంది. 2006, 2007, 2008 సంవత్సరాలలో పుట్టిన వారు అర్హులని అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్ర కుమార్, కోచ్ లక్ష్మణరావు తెలిపారు.

ఆదుకున్న మానవత్వం

- రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి
- చికిత్స పొందుతూ చిన్నారి కన్నుమూత
- బాధిత కుటుంబానికి స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సాయం

రాయవరం: ఒక రోడ్డు ప్రమాదం ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది. ప్రమాద స్థలంలో తండ్రి మృతి చెందగా, కుమార్తె చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచింది. తల్లి, చిన్న కుమార్తె అనాథలుగా మిగలారు. ఆ కుటుంబ సభ్యులను శ్రీ ముసలమ్మ తల్లి కేర్ క్లబ్ మానవత్వంతో ఆదుకుంది. వివరాల్లోకి వెళితే.. రాయవరం మండలం సోమేశ్వరం గ్రామానికి చెందిన దాసరి శ్రీను (35), పెద్ద కుమార్తె లలిత ఈ నెల 17న కొత్తపేట మండలం వాడపాలెం వెళ్లారు. అమ్మమ్మ గారి ఇంటి నుంచి తిరిగి సోమేశ్వరం వస్తున్న సమయంలో మండపేట మండలం వీరభద్రపురం వద్ద వీరి మోటారు సైకిల్‌ను ఆటో ఢీకొంది. అక్కడికక్కడే శ్రీను మృతి చెందగా, లలిత కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 21న మృతి చెందింది. దీంతో శ్రీను భార్య మణి, చిన్న కుమార్తె సత్యశ్రీ అనాథలుగా మిగిలారు. భర్తను, పెద్ద కుమార్తెను కోల్పోయిన మణి జీవచ్ఛవంగా మిగిలింది.

కేర్ తీసుకున్న క్లబ్ సభ్యులు

రహదారి ప్రమాదంలో శ్రీను మృతి చెందడం, చిన్న కుమార్తె ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకున్న సోమేశ్వరం శెట్టిబలిజ వీధికి చెందిన శ్రీ ముసలమ్మ తల్లి కేర్ క్లబ్ మానవత్వాన్ని చాటుకుంది. క్లబ్ నిర్వాహకుడు గుత్తుల శివ తన మిత్రులతో కలిసి బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు ఫండ్ డొనేషన్ ప్రోగ్రామ్ ప్రారంభించారు. తొలుత ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లలిత వైద్యం నిమిత్తం విరాళాలు సేకరించారు. వాట్సాప్ గ్రూపుల ద్వారా విషయాన్ని తెలియజేసి దాతల నుంచి విరాళాలు సేకరించారు. అయితే ఈ లోపు లలిత ఆరోగ్యం విషమించి అందని లోకాలకు చేరుకుంది. అప్పటికే విరాళాల రూపంలో సేకరించిన సొమ్ము రూ.2,02,464ను క్లబ్ సభ్యులు.. శ్రీను రెండో కుమార్తె సత్యశ్రీ పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఆ పత్రాలను ఆదివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. కష్టాల్లో ఉన్న వారిని ఆదుకునేందుకు శ్రీముసలమ్మ తల్లి కేర్ క్లబ్ చేస్తున్న కార్యకలాపాలను గ్రామస్తులు అభినందించారు. ఇప్పటి వరకు క్లబ్ ద్వారా పలువురిని ఆదుకున్నామని, భవిష్యత్తులో కష్టాల్లో ఉన్న వారిని ఆదుకునేందుకు మరింత కృషి చేస్తామని క్లబ్ నిర్వాహకుడు శివ తెలిపారు.


ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాన్ని సత్యశ్రీకి అందజేస్తున్న శ్రీముసలమ్మ తల్లి కేర్ క్లబ్ సభ్యులు

గోమాత యాతన


డ్రైనేజీ పక్కనే గొయ్యిలో పడిపోయిన ఆవు


ఎట్టకేలకు సురక్షితంగా బయటపడిన ఆవు

యానాం: కొత్త డ్రైనేజీలను నిర్మించిన తర్వాత రెండు వైపులా ఖాళీలను పూడ్చకపోవడంతో మూగజీవాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. గోపాల్ నగర్ దారిలోని మూడు తూముల జంక్షన్‌కు వెళ్లే ప్రదేశం వద్ద మేత మేస్తున్న గర్భంతో ఉన్న ఆవు పక్కనే ఉన్న ఆరడుగుల లోతైన గొయ్యిలో పడిపోయింది. అటుగా వెళుతున్నవారు గమనించి ఆ ఆవును బయటకు తీసేందుకు అనేక ప్రయత్నాలు చేశారు. స్థానికంగా నివసిస్తున్న డాక్టర్ డయానా తదితరులు స్పందించి ప్రొక్లెయిన్ రప్పించారు. గొయ్యిలోంచి బయటకు రావడానికి వీలుగా దారి చేయడంతో ఆవు సురక్షితంగా బయటకు వచ్చింది.

వీరేశ్వరస్వామికి జస్టిస్ వెంకటరాములు పూజలు


జస్టిస్ వెంకట రాములు దంపతులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ సిబ్బంది

ఐ.పోలవరం: మురమళ్లలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని తెలంగాణ లోకాయుక్త జస్టిస్ సి.వెంకట రాములు దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. తొలుత వీరికి ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ పట్టువస్త్రాలతో సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు. వేద పండితులు వేద ఆశీర్వచనం అందించారు. అనంతరం కుమారుడి వివాహ నిమిత్తం నిత్య కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు.

చనిపోయిన చేపల తరలింపు


చనిపోయిన చేపలను ట్రాక్టర్‌పై లోడ్ చేసిన దృశ్యం

యానాం: నల్ల చెరువు ఆవరణలోని ఒక చెరువులో మృత్యువాత పడిన చేపలను ఆదివారం ట్రాక్టర్‌పై తరలించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు పెసల వెంకటేష్, కాదా పవన్, హరి ప్రసాద్ మాట్లాడుతూ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ శాఖ పరిధిలోని రక్షిత మంచినీటి చెరువుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. చేపలు చనిపోయిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మంచినీటి చెరువుల నిర్వహణ, ఆధునీకరణ, రక్షణ తదితర అంశాలను ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. పీడబ్ల్యూడీ శాఖకు ఏటా కోట్లాది రూపాయలను బడ్జెట్‌లో ప్రభుత్వం కేటాయిస్తోందన్నారు. కొందరు పీడబ్ల్యూడీ అధికారులు తమ రాజకీయ పలుకుబడితో ఏళ్ల తరబడి ఇక్కడే ఉండిపోయారని ఆరోపించారు.

ఫైనాన్స్ వ్యాపారి అదృశ్యం


సత్యరామ్మోహన్‌రెడ్డి (ఫైల్)

రాయవరం: మండలంలోని పసలపూడికి చెందిన ఫైనాన్స్ వ్యాపారి నల్లమిల్లి సత్యరామ్మోహన్‌రెడ్డి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై జి.నరేష్ ఆదివారం విలేకరులకు తెలిపారు. ఒడిశాలోని రాయఘడ్‌లో సత్యరామ్మోహన్‌రెడ్డి ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నాడు. వ్యాపారం ముగించుకుని ఏప్రిల్ 21న మధ్యాహ్నం మూడు గంటల సమయంలో రాయఘడ్ నుంచి పసలపూడి బయలుదేరాడు. అనంతరం విశాఖపట్నం చేరుకున్నట్లుగా భార్య మౌనికకు సమాచారం ఇచ్చాడు. ఆ తర్వాత అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ అయ్యింది. దీంతో భార్య మౌనిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆనాటి స్నేహం.. అద్భుత జ్ఞాపకం..

- అంబాజీపేట హైస్కూల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం
- తరలివచ్చిన స్నేహితులు


గురువును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు


అంబాజీపేట హైస్కూల్లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

అంబాజీపేట: చదువులమ్మ చెట్టు నీడలో విద్యాబుద్ధులు నేర్చుకున్న స్నేహితులందరూ తిరిగి అదే చెట్టు నీడన జ్ఞాపకాలతో సేదతీరారు. దీనికి అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ ప్రాంగణం వేదికైంది. స్థానిక ఉన్నత పాఠశాలలో 1998 – 99 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు 25 ఏళ్ల అనంతరం ఆదివారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. తొలుత సభా వేదిక పైకి వెళ్లి ఒక్కొక్కరిగా పరిచయం చేసుకున్నారు. ఆనాటి తీపి జ్ఞాపకాలు, ఆటలు, అల్లర్లు, నిక్‌నేమ్‌లు గుర్తుకు తెచ్చుకుంటూ ఒకరినొకరు పిలుచుకుంటూ చిన్న పిల్లల్లా మారిపోయి ఉత్సాహంగా గడిపారు. ఆత్మీయ పలకరింపులతో యోగ క్షేమాలు తెలుసుకుంటూ ఆనందంగా సందడి చేశారు. వివిధ వృత్తులు, ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడి పలు ప్రాంతాల్లో ఉన్న వారంతా తరలివచ్చారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేద్దామని, తోటి విద్యార్థులకు సాయపడదామని తీర్మానాలు చేసుకున్నారు. విద్యార్థులందరూ వినోద కార్యక్రమాల్లో పాల్గొని, పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. తాము చదువుకున్న పాఠశాలకు బీరువాను బహూకరించారు. తోటి విద్యార్థి, అంబాజీపేటకు చెందిన కొవ్వూరి వెంకటేశ్వరరావు ఆరోగ్య సమస్యతో ఇబ్బంది పడటంతో అతనికి ఆర్థిక సాయం చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన 15 మంది గురువులను ఘనంగా సత్కరించారు. ఆత్మీయ కలయికకు కృషి చేసిన స్నేహితులను, తోటి విద్యార్థులు అభినందించారు. కార్యక్రమంలో రావూరి రాంబాబు, యర్రంశెట్టి సూరిబాబు, పొట్టుపోతు నాయుడు, క్రాంతి, బేగం, చందన తదితరులు పాల్గొన్నారు.

సింగపూర్ నుంచి వచ్చా



స్నేహితులందరినీ చూడాలనే ఆతృతతో సింగపూర్ నుంచి వచ్చాను. ఇక్కడ వీరందరినీ చూశాక ఎంతో ఆనందంగా ఉంది. తిరిగి మరోసారి కలిసేంత వరకు ఈ జ్ఞాపకాలను పదిలంగా ఉంచుకుంటాను.

– శనగల పార్వతి, అడ్మిన్, సింగపూర్

మధుర జ్ఞాపకాలు



పాతికేళ్ల క్రితం పదో తరగతి చదువుకున్న వారందరిని ఒకే వేదికపైకి తీసుకువచ్చేందుకు తోటి స్నేహితులు చాలా కష్టపడ్డారు. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ రీత్యా వెళ్లిన వారిని ఆత్మీయ సమ్మేళనానికి వచ్చేలా కృషి చేశాం. ఒకేసారి అందరినీ కలవడంతో పాత జ్ఞాపకాలు గుర్తుకు వచ్చాయి. ఆత్మీయ సమ్మేళనం మాకు మధుర జ్ఞాపకాలు అందించింది.

– తెలగరెడ్డి వీరభగవాన్, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యక్తిగత ఫొటోగ్రాఫర్

ఆనాటి రోజులు గుర్తొచ్చాయి



అంబాజీపేట హైస్కూల్లో చదువుకున్న ఆనాటి రోజులు, మధుర జ్ఞాపకాలు గుర్తుకొచ్చాయి. 25 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయి, అప్పటి విద్యార్థి మారిపోయి స్నేహితులతో ఆనందంగా గడిపాను.

– మేడిద కాశీ, గేమ్ డెవలపర్, బెంగళూరు

ఏడాది నుంచి కృషి చేశా



మిత్రులందరినీ ఒకే వేదిక పైకి తీసుకు వచ్చేందుకు గత ఏడాది నుంచి నా స్నేహితులతో కృషి చేశాను. మా అందరి కృషి ఫలించడంతో ఎంతో ఆనందం కలిగింది. ఈ మధుర క్షణాల కోసం ఏడాదిగా ఎదురు చూశాం. ఆత్మీయ కలయిక ఎన్నో జ్ఞాపకాలను ఇచ్చింది.

– ఆకుల శ్రీనివాస్, షిపిని విభాగంలో సాఫ్ట్‌వేర్, డీఆర్‌డీఏ, హైదరాబాద్

స్నేహితుల సహకారం



25 ఏళ్ల క్రితం పదో తరగతి చదువుకున్న నా తోటి విద్యార్థినుల వివరాలను స్నేహితుల సహకారంతో సేకరించాను. ఒక్కొక్కరికీ సమాచారం అందించి ఒకే వేదిక పైకి తీసుకువచ్చేలా కృషి చేశాను. ఆత్మీయ కలయికకు అందరూ రావడం చాలా ఆనందంగా ఉంది.

– బొక్కా మహాలక్ష్మి, హిందీ టీచర్, గొల్లవిల్లి